# 5

# యేసు యొక్క వార్తాహరుడు

## (3:1-12)

బాప్తిస్మమిచ్చు యోహాను యూదా దేశపు అరణ్యములో చేయుచుండిన ప్రబోధములను ప్రస్తావించుట ద్వారా మత్తయి, క్రీస్తు రాకడ కొరకైన సిద్ధపాటు అంశాన్ని మొదలుపెట్టాడు. ప్రవక్తయైన మలాకీ మొదలుకొని దాదాపుగా నాలుగు వందల సంవత్సరములు నెలకొని యుండిన ప్రవచనాత్మక నిశ్శబ్దమును యోహాను పరిచర్య ఛేదించుచున్నది.[1] తన యూదీయ చదువరులు అప్పటికే యోహాను గూర్చి సవివరంగా ఎరిగినవారై యుందురని మత్తయి భావించాడు, గనుక ఆయన ప్రవక్త యొక్క నేపథ్యమునకు సంబంధించిన వివరములను తన సువార్తలో చేర్చలేదు. యూదులు యోహానును బాగుగా ఎరిగినవారై యుండిరను వాస్తవము సువార్తలలో నిర్ధారణ చేయబడుచున్నది మరియు యూదీయ చరిత్రకారుడు జోసీఫస్ చేత బలపర్చబడుచున్నది.[2]

యోహాను యొక్క తొలి రోజుల జీవితము గూర్చి మిగిలిన మూడు సువార్తల కంటె ఎక్కువ సమాచారమును లూకా సమకూర్చుచున్నాడు. యోహాను తండ్రీ ఒక యాజకుడు, ఆయన పేరు జెకర్యా, ఈయన అబీయా తరగతిలో ఎనిమిదవ విభజనయై యుండెను (లూకా 1:5). రాజైన దావీదు యాజకత్వము ఇరువది నాలుగు విభాగములుగా వ్యవస్థీకరించాడు (1 దినవృత్తాంతములు 24వ అధ్యాయములు). ఈ విభాగములలో నుండి ఒక్కొక్క విభాగమునకు సంబంధించినవారు దేవాలయములో సంవత్సరమునకు రెండు వారములు యాజక ధర్మములు నిర్వర్తించవలెను. మిగిలిన నాలుగు వారములు యూదులు ప్రధాన పండుగల రోజులై యుండినవి, గనుక ఈ రొజుల్లో యాజకులలో నుండి (అందరు కాకపోయినా) అధిక సంఖ్యాకులు పాల్గొనుచుండిరి.

ఎలీసబెతు, జెకర్యా భార్య, సంతానము కలుగుటకు అవకాశములుండు వయస్సు గతించునంత వరకు కూడ ఆమె సంతానములేని సతీమణిగా మిగిలిపోయింది (లూకా 1:7, 18). ఆమె, యేసు తల్లియైన మరియకు, బంధువురాలై, బహూశా పిన్నియై యుండవచ్చును (లూకా 1:36). జెకర్యా దేవాలయములో ఎప్పటివలెనే తన యాజక ధర్మములను నిర్వర్తించుచుండగా, గబ్రియేలను దేవదూత ఆయనకు ప్రత్యక్షమై, ఎలీసబెతు ఆయనకు ఒక కుమారుని కనుననియు, వాని పేరు "యోహాను" అనియు తెలియజెప్పాడు. ఆయనకు తెలియజెప్పు విషయము గూర్చి జెకర్యా తన అపనమ్మకమును అభివ్యక్తము చేసినప్పుడు, ఆయన మూగవాడుగా చేయబడి తన కుమారుడు జన్మించునంత వరకు తెరచి మాటలాడలేకపోయాడు (లూకా 1:11-22, 59-64).

యోహాను, దేవుని యొక్క ఒక ప్రత్యేకమైన పరిచారకుడై యుండుననియు, యింకను తల్లి గర్భములో ఉన్నప్పుడే పరిశుద్ధాత్మ చేత నింపబడుననియు జెకర్యాకు దేవదూత తెలియజేసెను అతడు ఇశ్రాయేలులో అనేకులను వారి దేవుడైన యెహోవా వైపు త్రిప్పవలసినవాడై యుండెను

(లూకా 1:15, 16). యోహాను ద్రాక్షరసమైనను మద్యమైనను త్రాగక యుండవలసినవాడై యుండెను గనుక అతడు నాజీరుచేయబడినవాడై యుండెనని అనేకులు చెప్పుకొనుచుందురు, అట్లయినను నాజీరుచేయబడుటకు అవసరమై యుండిన ఇతర అవసరములు పేర్కొనబడలేదు (లూకా 1:15; సంఖ్యాకాండము 6వ అధ్యాయము చూడుము). యోహాను "... ఏలియా యొక్క ఆత్మయు శక్తియు గలవాడై" వచ్చునని కూడ దేవదూత సెలవిచ్చాడు (లూకా 1:17). "యెహోవా నియమించిన భయంకరమైన ఆ మహా దినము రాకమునుపు, ప్రవక్తయైన ఏలీయా వచ్చునని" ప్రవక్తయైన మలాకీ ప్రవచించాడు (మలాకీ 4:5). యోహాను పుట్టిన తరువాత, జెకర్యా తన స్తోత్రగీతములో, "ఆయన మార్గములను సిద్ధపరచుటకై నీవు [యోహాను] ప్రభువునకు ముందుగా నడుతువు" అని ప్రవచించాడు (లూకా 1:76). ఈ ఘోషణ మలాకీ 3:1కి దగ్గరగా నున్నది. "ప్రభువు కొరకు ఆయత్త పడియున్న ప్రజలను సిద్ధపరచుటకై ... ఆయనకు [ప్రభువుకు] ముందుగా వెళ్లును" అని దేవదూత తెలియజెప్పాడు (లూకా 1:17). రాబోవు ఏలీయా యితడే అని యేసు అటుతరువాత యోహాను గూర్చి పలికాడు (మత్తయి 11:10, 14; 17:11–13).

## సిద్ధపరచు సందేశము (3:1–4)

**1ఆ దినములయందు బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చి 2పరలోకరాజ్యము సమీపించియున్నది, మారుమనస్సు పొందుడని యూదయ అరణ్యములో ప్రకటించుచుండెను.**

**3ప్రభువు మార్గము సిద్ధపరచుడి**
**ఆయన త్రోవలు సరాళము చేయుడని**
**అరణ్యములో కేకవేయు నొకని శబ్దము**

**అని ప్రవక్తయైన యెషయా ద్వారా చెప్పబడినవాడితడే. 4ఈ యోహాను ఒంటె రోమములు వస్త్రమును, మొలచుట్టు తోలుదట్టియు ధరించుకొనువాడు, మిడతలు అడవి తేనెయు అతనికి ఆహారము.**

**వచనము 1. ఆ దినములయందు** అను పదజాలము పుట్టుక గూర్చిన కథను (అధ్యాయములు 1; 2) యేసు పరిచర్య కొరకైన సిద్ధపాటుతో (అధ్యాయము 3) జోడించుచున్నది. యేసు నజరేతులో జీవించుచుండిన కాలము గూర్చి ఒక సాధారణ ప్రస్తావన చేయబడుట సాధ్యమే (2:23). అట్లయినను అది క్రైస్తవ మహోద్యమము యొక్క ఆరంభమును సూచించుచున్నదని కొందరు అరవివరణ చెప్పుచున్నారు. హేరోదు మరణించి (క్రీ.పూ. 4), యేసు కుటుంబము ఇశ్రాయేలునకు తిరిగి వచ్చి, నజరేతులో స్థిరపడినప్పటికి దాదాపు ముప్పది సంవత్సరములు గతించిపోయాయి (2:22–23). **యోహాను** పరిచర్యను ప్రారంభ తేది "తిబెరికైసరు ఏలుబడిలో పదునైదవ సంవత్సరము" (క్రీ.శ. 28) అని లూకా 3:1 నిర్దిష్టముగా పేర్కొనుచున్నది. యేసు తన పరిచర్యను ప్రారంభించినప్పటికి "దాదాపు ముప్పది ఏండ్ల యీడుగలవాడై యుండెను" (లూకా 3:23), గనుక యోహాను యేసుకంటె ఆరు మాసములు పెద్దవాడు (లూకా 1:36, 56, 57). కాబట్టి, యోహాను కూడ తన పరిచర్యను ప్రారంభించినప్పుడు దాదాపు ముప్పది యేండ్లవాడై యుండెను.

యోహాను విషయంలో గాని యేసు విషయంలో గాని వారి బాల్య దినముల వివరములు

సువార్తల రచయితలు ఎక్కువగా గ్రంథస్థం చేయలేదు (లూకా 1:80; 2:40–52 చూడుము). ఇందుకు హేతువేమనగా సువార్తల ఉద్ఘాటన ఎక్కువగా యేసు మరణము, సమాధి, మరియు పునరుత్థానముతో ముగియుచున్న ఆయన పరిచర్యపై ఉన్నది. మొదటి శతాబ్దము తరువాత, యేసు బాల్యము గూర్చి చిత్రవిచిత్రమైన ప్రాచీన కథలు ప్రబలముగా విస్తరించాయి. రాబర్ట్ హెచ్. మౌన్స్ ఇలా రాయుచున్నాడు, "అదృష్టవశాత్తు, ప్రామాణిక గ్రంథములకు సంబంధించిన సువార్తలలో సంచలనాత్మకమైన చిత్రీకరణములేవియును లేవు. నిస్సందేహంగా యేసు కూడ ఇతర యూదీయ మగపిల్లలందరి వలెనే వర్ధిల్లాడు."[3]

అతని తలిదండ్రులు మరణించి యుందురు (లూకా 1:7). గనుక ఈ జాతికి చెందిన సభ్యులు యోహాను గూర్చి తగు శ్రద్ధ వహించి యుందురని వారు సూచించుదురు, లేదా ఒక యౌవనుడుగా యోహాను వారిలో చేరిపోయి యుండునని చెప్పుదురు. తత్ఫలితంగా, యోహాను యొక్క దృష్టికోణములన్నియు ఎస్సెనీయుల బోధల చేత ప్రభావితమై అతని ఆలోచనల్లో వాటి రూపును దిద్దుకొన్నాయని వారు చెప్పుదురు. ఇటువంటి సిద్ధాంతము సహేతుకమైనదిగా తోచుచున్నను, అది ఋజువు చేయబడలేదు. యోహాను "ఎదిగి, ఆత్మయందు బలము పొంది, ఇశ్రాయేలునకు ప్రత్యక్షమగు దినము వరకు అరణ్యములో ఉండెను" అని మాత్రమే లేఖనములు తెలియజెప్పుచున్నవి (లూకా 1:80). అది మాత్రమేగాక, ఆయన ఒక ప్రవక్తయై యుండెను గనుక ఆయన తన సందేశములను పరలోకము నుండి పొందుకొనెను: "... అరణ్యములో నున్న జెకర్యా కుమారుడైన యోహాను నొద్దకు దేవుని వాక్యము వచ్చెను" (లూకా 3:2).

యోహాను, సామాన్యముగా ఆయన చేయుచుండిన పనినిబట్టియే **బాప్తిస్మమిచ్చు** లేక "బాప్తిస్మమిచ్చువాడు" (*baptistēs*) అని పిలువబడ్డాడు: ఆయన ప్రజలకు బాప్తిస్మమిచ్చుచుండెను (మత్తయి 3:6పై గల వ్యాఖ్యానము చూడము). మత్తయి ప్రకారం, **ఆయన యూదయ అరణ్యములో ప్రకటించుచుండెను.** "ప్రకటించుచుండెను" అను పదము "[ఒక వార్తాహరుడుగా] బోధించు" అని అర్థమిచ్చు (*kērussō*) నుండి ఉత్పన్నమయ్యింది. ఒక "వార్తాహరుడు" బహిరంగ చాటింపులు చేయుచుండువాడై యుండెను. "అరణ్యము" (*erēmos*) అను పదము సాధారణంగా బంజరు భూమి లేదా నిర్మానుష్యమైన బీడుభూమి యని అర్థము. యెరూషలేమునకును మృత సముద్రమునకును మధ్య జననివాసంలేని మరియు వ్యవసాయం చేయని రాళ్ల ప్రాంతంగాను మరియు ప్రదేశమును సూచించుటకు మత్తయి ఈ పదమును ప్రయోగించాడు, ఈనాడు ఈ భూభాగములో కొంత శిలామయమైపోయి విపత్సూచక ప్రాంతముగా నున్నది. జాక్. పి. లూయిస్ ఈ ప్రాంతమును ఇలా వర్ణించుచున్నాడు:

> యూదా దేశ అరణ్యము, మధ్యస్థ మెరకు నేల నుండి క్రిందికి ఏటవాలుగా మృత సముద్రము వైపు ఉండి, నీళ్లు అక్కడక్కడ లభించు ప్రదేశమై యున్నది ఏలయనగా మధ్యధరా సముద్రము మీదుగా వచ్చు మేఘములు వాటి నీటి ఆవిరిని పర్వత శ్రేణులు పశ్చిమమున నున్న మిట్ట ప్రదేశములలో రాల్చును. అది కొండల ప్రదేశమై, మిక్కిలి ఏటవాలుగాను అపాయకరముగాను ఉండు గడ్డి లోయలు కలిగి, మశూచికము వలన చర్మముపై ఏర్పడిన మచ్చల వలె అగుపించు గుహలతో, పెద్ద పెద్ద రాళ్లు కలిగి, అదొక నిర్మానుష్యమైన బంజరు భూమియై కుమ్రాన్ వంటి బైరాగులను ఆహ్వానించిన ప్రదేశమై యున్నది.[4]

యోహాను తన పరిచర్యను అరణ్యములో ఆరంభించాడను వాస్తవము ప్రాముఖ్యతను సంతరించుకొనుచున్నది. మెస్సీయ వచ్చి దేవుని ప్రజలను విడిపించు ప్రక్రియ అచ్చట ఆరంభమగునను ఒక సాధారణ ఎదురుచూపుండినది (24:23-26; అపొస్తలుల కార్యములు 21:38 చూడుము).[5] యోహాను అటుతరువాత ఉత్తరమున మరియు తూర్పున నున్న దూర ప్రదేశములలో ప్రకటించుచు, "యొర్దాను నదికి ఆవల నున్న బేతనియ" (యోహాను 1:28) మరియు "సలీము దగ్గర నున్న ఐనొనను" (యోహాను 3:23) పట్టణములకు సమీపమున యొర్దాను నదిలో ప్రజలకు బాప్తిస్మమిచ్చుచుండెను.

**వచనము 2**. యోహాను ప్రబోధించిన సందేశము స్పష్టముగాను, సామాన్యమైనదిగాను ఉండినది, గనుక అది సులభంగా అర్థమయ్యేదయ్యింది: యూదులు మారుమనస్సు పొంది దేవుని తట్టు తిరుగవలెనని వారికి పిలుపునిచ్చాడు. అన్యజనులుకు వలెనే, వారు సహితము ఖచ్చితంగా మారుమనస్సు పొందవలసి యున్నదని ఘోషించుట ద్వారా ఆయన తన యూదీయ ప్రజలను దిగ్భ్రాంతిపర్చాడు. ఈ వాక్యభాగములో "మారు మనస్సు" అను పదమునకు వాడబడిన గ్రీకు పదము (*metanoeō*) జీవితము సంస్కరింపబడునట్లు మనస్సులో కలిగిన మార్పును సూచించు పదమై యున్నది. క్రొత్త నిబంధనలో ఈ ప్రత్యేకమైన పదము ప్రయోగింపబడిన ప్రతిసారి అది, "మనస్సును, ఉద్దేశమును, పాపము నుండి పరిశుద్ధతకు మార్చుకొనుటకు సంబంధించిన ప్రసక్తియై యున్నదని" జాన్ ఏ. బ్రోడస్ చెప్పుచున్నాడు.[6] యూదులు మారుమనస్సు పొందవలసిన వారికి పిలుపునిచ్చుట ద్వారా యోహాను, పాత నిబంధన ప్రవక్తలు చేసిన విన్నపమును పునరుజ్జీవింపజేసాడు (యెషయా 55:7; యిర్మీయా 15:19; యెహెజ్కేలు 33:11; హోషేయా 14:1, 2; యోవేలు 2:12, 13; జెకర్యా 1:3, 4; మలాకీ 3:7).

**పరలోక రాజ్యము సమీపించి యున్నది** అని పలుకుట ద్వారా, వారు మారుమనస్సు పొందవలెనని దాని అగత్యము యొక్క అవగాహనతో యోహాను ఆయను ఇచ్చిన పిలుపుకు మద్ధతు కూడగట్టుకొన్నాడు. శతాబ్దాలుగా దేవుని చేత వాగ్దానము చేయబడిన రాజ్యము (దానియేలు 2:44; 7:13, 14) యింకను రాలేదు, కానీ అది అగుపించుచున్న సమయం ఆసన్నమగుచుండినది. వారు పరలోకరాజ్య పౌరులు కావలెనని కొరుచున్నట్లయితే, తమ మనస్సులను, వైఖరులును, మరియు ప్రవర్తనను మార్చుకొనక తప్పదని యోహాను ప్రజలకు తెలియజెప్పాడు. మారుమనస్సుకు సంబంధించిన సందేశము మరియు పరలోక రాజ్యము సమీపముగా నున్నదను విషయము యేసు చేతను (4:17), ఆయన అపొస్తలుల చేతను (10:7) కొనసాగింపబడినది. రాబర్ట్ హెచ్. గుండ్రి గమనించిన విషయమేమనగా, "మూల రూపమైయున్న యోహాను, ఉపదేశకుడై యున్న యేసు, పన్నెండు మంది శిష్యులు – అందరు అదే సందేశమును ప్రబోధించుచున్నారు."[7]

"పరలోక రాజ్యము" అను నియమిత పేరు లేఖనములలో అగుపించుట మత్తయి 3:2 మొదటిసారై యున్నది. మత్తయికి ఈ పదజాలము విశేషమైనదై యున్నది, గనకు ఆయన ఈ పదజాలమును 32 సార్లు ప్రయోగించాడు. ఇతర సువార్తలలో ఈ పదమునకు బదులుగా "దేవుని రాజ్యము" అని రాయబడి యున్నది.[8] ఒక ప్రత్యేకమైన యూదీయ పోకడలో, ఈ పుస్తకము కొన్ని పర్యాయములు "దేవుడు" ఉండివలసిన చోట "పరలోకము"ను ప్రత్యామ్నాయముగా వాడుచున్నది, తద్వారా దైవత్వమునకు సంబంధించిన ప్రస్తావనను

దూరము చేయుచున్నది. రాజ్యము పరలోకమందు ఆరంభమయ్యింది, గనుక పరిపాలన సహితము పరలోకము నుండి జరుగుచుండును. "నా రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదు" అని యేసు పిలాతుతో చెప్పాడు (యోహాను 18:36), నేడు సహితము దేవుని రాజ్యమును ప్రభువు పరలోకమందలి తన సింహాసనముపై నుండి పరిపాలించుచున్నాడు (అపొస్తలుల కార్యములు 2:32–36; 1 కొరింథీయులకు 15:24).

ఈ రాజ్యము భూమిపై సంఘముగా, మత్తయి 16:18, 19లో యేసు ముందుగానే సూచించినట్లుగా, అగుపించినది. పెంతెకొస్తు దినాన, దేవుని రాజ్యము క్రీస్తు విధాయకము చొప్పున పరిపాలింపబడునను సందేశమును అంగీకరించినవారు బాప్తిస్మము పొందుకొని సంఘములో చేర్చబడిరి (అపొస్తలుల కార్యములు 2:38, 47). ఇటువంటివారు, "అంధకారసంబంధమైన అధికారములో నుండి విడుదల చేయబడి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులనుగా చేయబడదురు" (కొలొస్సయులకు 1:13). వారు నిశ్చలమైన "రాజ్యమును" పొందుకొన్నారని హెబ్రీ పత్రిక రచయిత క్రైస్తవులైన తమ చదువరులకు తెలియజెప్పుచున్నాడు (హెబ్రీయులకు 12:28). ఆయన (యోహాను) "రాజ్యములో వారి సహోదరుడును, పాలివాడునై యున్నాడని" అపొస్తలుడైన యోహాను తన తోటి విశ్వాసులకు తెలియజెప్పుచున్నాడు (ప్రకటన 1:9).

**వచనము 3.** క్రీస్తు యొక్క దూతగా పంపబడువాని గూర్చి **యెషయా** పలికిన ప్రవచనమును బాప్తిస్మమిచ్చు యోహాను నెరవేర్చాడని మత్తయి వెల్లడిపర్చుచున్నాడు:

> **ప్రభువు మార్గము సిద్ధపరచుడి**
> **ఆయన త్రోవలు సరాళము చేయుడని**
> **అరణ్యములో కేకవేయు నొకని శబ్దము**

మత్తయి చెప్పుచున్న యెషయా 40:3 ఉల్లేఖనము సెప్టుజింట్‌పై ఆధారపడియున్నది, కాకపోతే చివరి వరుస, "ఆయన త్రోవలు సరాళము చేయుడి" అనునది "దేవుని మార్గము సరాళము చేయుడి" నుండి అనుకూలింపజేసికొనబడినది. తత్ఫలితంగా, "ప్రభువు" అను పదము అతి సులభంగా యేసుకు అన్వయింపజేయబడుచున్నది.

దాని మూల గ్రంథములోని వాక్య భాగంలో, యెషయా 40:3 దేవుని మార్గమును, బబులోను చెరలో నుండి యెరూషలేమునకు తిరిగి వచ్చువారికి నాయకత్వము వహించి నడిపించనైయున్న వాని మార్గమును సిద్ధపరచుటను[9] – జాతీయ విడుదల మరియు పునరుద్ధరణ చర్యగా నున్న విషయమును సూచించుటకు అవకాశము కలదు. ఏదిఏమైనా, క్రీస్తు కొరకు, దేవుని ప్రజలకు ఆధ్యాత్మిక విడుదలను కలుగజేసి వారిని పునరుద్ధరించనైయున్నవాని కొరకైన మార్గమును యోహాను సిద్ధపరచుటలో ఈ మాటలు అతి గొప్పగా నెరవేరుచున్నవి.

త్రోవలను "సరాళము" చేసి వాటిని సమానము చేయుట గూర్చిన మనఃకల్పన ప్రాచీన కాలమందు అరణ్యము గుండా ఉండిన మార్గములు ఎంతో అప్రతిష్టాపూర్వకంగా ఉండినవను వాస్తవముపై ఆధారపడి యున్నది. పాల్. టి. బట్లర్ ఇలా వివరించుచున్నాడు,

> పొదలు, పర్వతములు, లోయలు, రాళ్లు, మరియు అడవి జంతువులతో నిండియుండిన

> ఈ అరణ్యములు ప్రాచీన కాలంలో ప్రయాణాలు సాగించుటకు భయభీతిని కలిగించు బలవత్తరమై అడ్డంకులను ఒకరి ముందుంచుచుండినవి. రాజులు మరియు సామంతులు వారు ప్రయాణంచేయదలచినప్పుడు, వీటికి అడ్డంగా పయనించుచు ఇటువంటి భూభాగమును దాటి వెళ్లవలసి వచ్చినది గనుక, లోయలను ఎత్తు చేయుచు, పర్వతములను పడగొట్టుచు తద్వారా వారు పయనించగలుగునట్లు ఒక సురక్షితమును సుళువైనదైన మార్గమును సిద్ధపరచుటకు బానిసలను మరియు పనివారిని భారీ సంఖ్యలోవారికి ముందుగా పంపించుచుండిరి.[10]

మారుమనస్సు పొందవలెననియు, పరలోక రాజ్యము సమీపముగా నున్నదనియు ప్రబోధించుట ద్వారా, యోహాను రానైయుండిన రాజు నిమిత్తము ప్రజలు హృదయాలను సిద్ధపరచుచుండెను (మార్కు 1:2, 3; లూకా 3:4–6; యోహాను 1:23 చూడుము). లూయిస్ గమనించిన విశేషమేమనగా, ఈ కాలములో అరణ్యములో నుండిన "ఇతరులు – కుమ్రాన్ సమాజము – ఆ 'మార్గము' వారే అని తమ్మును గూర్చి తెలియజెప్పుకొనుచు, యెషయాకు [40:3] కొంచము భిన్నమైన రీతిలో విన్నవించుకొన్నారు."[11] వారి ఉద్యమము అంతమొందినది, అయితే నిరంతరము నిలిచియుండు క్రీస్తు రాజ్యము కొరకైన మార్గమును యోహాను సిద్ధపర్చాడు.

**వచనము 4. యోహాను ఒంటె రోమముల వస్త్రమును, మొలచుట్టు తోలు దట్టియు** ధరించియుండుటను చూచుట అదెంతో గంభీరమైన దృశ్యమై యుండెను కదా! ఈ వర్ణన ఆయన నివసించుచుండిన అరణ్యమునకును, ఆయన ఉపదేశించుచుండిన సామాన్య సందేశమునకును సరిపడినదై యుండినది. యోహాను జీవితము, తన్నుతాను ఉపేక్షించుకొనిన బలియాగముతో కూడినదై యుండెను. యేసు ఈయనను "సన్నపు బట్టలు" ధరించుకొనుచు "రాజగృహాములలో" నివసించుచుండిన ధనవంతులతో పోల్చుచు వారి మధ్య ఉండిన తారతమ్యమును తేల్చాడు (11:8).[12] యోహాను ధరించిన మొరటు దుస్తులు మరియు ఆయన అగుపించుచుండిన ఆకారము నిస్సందేహాంగా ప్రజలకు ప్రాచీన కాలము నాటి ప్రవక్తలను గుర్తుచేసినది (జెకర్యా 13:4) – బహూశా ప్రత్యేకించి ఏలియా (2 రాజులు 1:8; మలాకీ 3:1; 4:5; మత్తయి 11:14; 17:10–13 చూడుము). అతని గూర్చి ఏమనుకొనవలెనో యూదులకు సరిగా తెలియలేదు, కానీ అతడొక ప్రవక్తయై యుండెనని వారేరిగి యుండిరి (11:9; 21:26).

యోహాను జీవిత విధానము అసాధరణమైనదై యుండినట్లే, అతని ఆహారము, **మిడతలు మరియు అడవి తేనె** కూడ అసాధారణమైనదై ఆయన నివసించుచుండిన అరణ్యప్రదేశమునకు సరిపడినదై యుండినది, కానీ జనసమ్మర్దమైన ప్రాంతములో నివసించుచుండినవారికి అదొక అసాధారణమైన అంశముగా ఉండినది. గుండ్రీ, యోహాను నిజముగా నాజీరుచేయబడినవాడై యుండునని అనుకొనుచు, ఇలా వ్యాఖ్యానిస్తున్నాడు, "మిడతలు మరియు అడవి తేనె అరణ్యములో అక్కడక్కడ లభ్యమగుచుండిన ఆహారమని చెప్పుకొనుటకు తగిన విషయమై యున్నదని మాత్రమే కాదు, కానీ దానిలో నుండి రక్తము తీసివేయబడవలసిన మాంసము లేకుండా (గనుకనే మిడతలు) మరియు ద్రాక్షరసము లేకుండా (గనుకనే తేనె) అదొక ప్రత్యేకంగా పరిశుద్ధమును సామాన్యమునైన ఆహారమై యుండినది."[13] యోహాను యొక్క ఆహారపుటలవాట్లు ఆయన దయ్యము చేత పట్టబడినవాడై యుండెనను ఆరోపణకు దారి

తీసినవి (11:18).

"అడవి తేనె" "అడవి తేనెటీగల చేత ఉత్పత్తిచేయబడిన తేనెయై యుండినది, పెంపుడు తేనెటీగలు ఉత్పతిచేసినది కాదు."[14] ఇటువంటి తేనె బైబిలు కాలములో సామాన్యమైన విషయమై యుండినది (ద్వితీయోపదేయశకాండము 32:13; న్యాయాధిపతులు 14:8, 9, 18; 1 సమూయేలు 14:25, 26, 29; కీర్తనలు 81:16). మిడతలను ఆహారముగా అరగించుట అను మాటలు మన చెవినపడగానే, మన కడుపులో తిప్పివేయుచున్నట్లు అనిపించవచ్చును, కానీ ఇశ్రాయేలీయులు వీటిని ఆహారముగా నిరభ్యరంతరముగా ఆరగించవచ్చుననని దేవుడు అనుమతించాడని – బహుశా, వారిని ప్రోత్సాహించి యుండును కూడ – తేటగా తెలియుచున్నది (లేవియకాండము 11:22). వాటి తయారీ గూర్చి, హెచ్. లియో బోల్స్ ఇలా చెప్పుచున్నాడు,

> అవి కాల్చబడినవి మరియు కొన్ని పర్యాయములు ఉడికించబడినవి, లేదా ఉప్పువేసి ఊరబెట్టబడినవి, మరియు అవి పుష్కలంగా లభించుచుండిన తూర్పు దేశాల్లోని పేద ప్రజల చేత ఆరగింపబడుచుండినవి. కొన్ని పర్యాయములు ఎండలో బాగుగా ఎండబెట్టబడి మిడతల కాలము తరువాత తినుటకు భద్రముగా దాచిపెట్టబడినవి. వాటిని ఆహారముగా సిద్ధము చేయక ముందు వాటి తలలు, కాళ్లు మరియు రెక్కలు తీసివేయబడినవి; అవి తాజాగాను, ఎండబెట్టబడినవిగాను ఆరగింపబడినవి.[15]

మిడతలు నేడు కూడ ఆహారంగా ఉపయోగింపబడుచున్నవి, కొన్ని తూర్పు దేశాల సంస్కృతులలో అవొక అత్యంత రుచికరమైన భోజనముగా పరిగణింపబడుచున్నవి.

## సిద్ధపరచు బాప్తిస్మము (3:5, 6)

**5 ఆ సమయమున యెరూషలేమువారును యూదయ వారందురును యొర్దాను నదీప్రాంతముల వారందరును, అతనియొద్దకు వచ్చి, 6 తమ పాపములు ఒప్పుకొనుచు, యొర్దాను నదిలో అతనిచేత బాప్తిస్మము పొందుచుండిరి.**

**వచనము 5**. ప్రవక్తలలో అధిక సంఖ్యాకులు ప్రజలుండిన మహా నగరములకును, పట్టణములకును మరియు గ్రామములకును వెళ్లుచుందురు, కానీ యోహాను విషయంలో, అరణ్యములో ఉండిన ఆయన యొద్దకు ప్రజలే వచ్చుచుండిరి. యోహాను యొర్దాను నదిలో బాప్తిస్మమిచ్చుచుండెను, గనుక ఆయన చేత బాప్తిస్మము పొందుకొనుటకు సామాన్య ప్రజానీకము ఆయన యొద్దకు గుమికూడుచుండిరి. **ఆ సమయమున యెరూషలేము వారును యూదయ వారందరును యొర్దాను నదీప్రాంతముల వారందరును అతని యొద్దకు వచ్చిరని** మత్తయి రచించాడు. "అందరు" అను పదము ఇచ్చట అతిశయోక్తిగా ప్రయోగింపబడినది. నిశ్చయముగా, పేర్కొనబడిన స్థలములన్నిటిలోనుంచి తండోపతండలుగా వచ్చిన ప్రజలందరు ఆయన సందేశమును వినుటకు రాలేదు, కానీ ప్రతి ఒక్క స్థలములో నుంచి వచ్చిన వారిలో అధిక సంఖ్యాకులు ఆయన సందేశమును వినుటకే వచ్చుచుండిరి, ఆయనకు విరోధముగా ప్రజానీకంలో తిరుగుబాటు చెలరేగునేమో యని రాజ్యాధినేతయై యుండిన హేరోదు అంతిపయ భయపడిపోవునంతగా, యోహాను ప్రజాదారణ పొందినవాడై యుండెనని జోసీఫస్ చెప్పుచున్నాడు.[16]

**వచనము 6**. యోహాను సందేశములను వినుటకు వెళ్లినవారిలో అనేకులు **ఆయన చేత బాప్తిస్మము పొందుకొన్నారు.** "బాప్తిస్మము" అని అనువదింపబడిన గ్రీకు పదము, (*baptizō*) అయియున్నది, దీనికి "ముంచుట, స్నానం, కడుగుట" అని అర్థము.[17] యోహాను ప్రజలకు బాప్తిస్మమిచ్చినప్పుడు, ఆయన వారిని "నీటిలో నిండుగా ముంచాడు" (యోహాను 3:23 చూడుము). క్రైస్తవ బాప్తిస్మము కూడా నీటిలో నిండుగా ముంచబడు ప్రక్రియ ద్వారా పొందుకొనబడునదై యున్నది, తద్వారా పశ్చాత్తాపపడిన విశ్వాసి క్రీస్తుతో కూడ "పాతిపెట్టబడును" (రోమీయులకు 6:4; కొలొస్సయులకు 2:12). "పోయు" మరియు "చిలకరించు" అని అర్థమిచ్చునవి గ్రీకు భాషలో ఇతర పదములు కూడ ఉన్నవి కానీ ఈ పదములు బాప్తిస్మము సందర్భములో క్రొత్త నిబంధనలో ఎన్నడను ఉపయోగింపబడలేదు.

బాప్తిస్మమునకు అంటగట్టబడినప్పటికిని, ప్రాచీన ప్రపంచంలో నీటిలో నిండుగా ముంచుట ఒక మత సంస్కార విధిగా *సామాన్యమైన విషయమై* యుండినది డేవిడ్. ఎస్. డోక్కరీ ఇలా చెప్పుచున్నాడు,

> సంబంధిత ఉదాహరణములలో, గంగా నదిలో నిర్వహింపబడు హైందవ సంస్కారవిధులు, బబులోను అన్యమతారాధికులైన ఎన్‌కి వారి పవిత్రీకరణ కర్మకాండ, మరియు ఐగుప్తీయులు అప్పుడే పుట్టిన శిశువులను పవిత్రీకరించుట, మృతిచెందినవారిపై జరిపింపబడు ప్రతీకాత్మక పునరుద్ధరణ సంస్కరణలు మొదలగు ఐగుప్తీయుల అభ్యాసములు కలిసి యున్నవి. *Baptizō* మరియు సంబంధిత పదములు క్రేటిన్ మతములోను, త్రేసియస్ మతములోను, ఎలుసినియన్ మర్మ మతములోను, మరియు అనేక నాస్తికవాద గుంపులు మరియు అన్యమతారాధికుల సంస్కార విధులను నిర్వచించుటకు ఉపయోగింపబడినవి.[18]

ఏదిఏమైనా, యూదా మత అభ్యాసములు (మార్కు 7:3, 4; హెబ్రీయులకు 6:2; 9:10), యోహాను బాప్తిస్మముతో, అతి దగ్గర సంబంధము కలిగియున్నవి. ఒకడు ఆచార కర్మ సంబంధములో శుద్ధుడై యుండగొరినట్లయితే, వాడు సంస్కార విధిగా కడుగుకొనుట ధర్మశాస్త్రము ప్రకారము అవశ్యమై యుండినది (లేవికాండము 15). మిష్నా రచనలలోని రెండవ భాగమంతా ఈ అంశమునకే కేటాయింపబడి యున్నది.[19] అంతేగాక, యూదులు సంస్కార స్నానముల (*miqwa'oth*) గూర్చినవి. అనేక పురావస్తుశాస్త్ర సంబంధ ఉదాహరణములు దాదాపుగా మొదటి శతాబ్దమునకు చెందినవి. ఇశ్రాయేలు ఈనాడు సహితము అమలులో ఉన్నవి. కుమ్రాన్‌లో, మారుమనస్సు పొందుట మరియు ఒక నూతన యుగారంభము గూర్చి కూడ బలముగా నొక్కివక్కాణించుచుండిన సమాజములో, సంస్కార స్నానములు ప్రత్యేకముగా ప్రాముఖ్యమైనవై యుండినవి.[20] ఇంకా, కాలక్రమానుగతము గూర్చి వాదోపవాదములు జరుగుచుండగా, మొదటి శతాబ్దములో, అన్యజనులు యూదా మతావలంబికులగునట్లు వారు తమ్మునుతాము నీటిలో ముంచుకొనవలసిన అవసరము ఉండినదని – సున్నతి పొందుట మరియు బల్యర్పణలు గావించుట కూడ అవసరమై యుండినదని – అనేకులు నమ్ముదురు.[21]

ధర్మశాస్త్ర ప్రకారమైన సంస్కార స్నానములు మరియు అన్యమతావలంబికుల బాప్తిస్మము యొక్క సాంప్రదాయము యోహాను బాప్తిస్మమునకు ఒక నేపథ్య దృశ్యముగా ప్రయోజనపడుచున్నను, అనేక వ్యత్యాసములున్నవి. (1) యోహాను బాప్తిస్మము ఒక ప్రవక్త చేత నిర్వహింపబడినది, సంస్కార స్నానములు మరియు అన్యమతావలంబికుల బాప్తిస్మము

వారికై వారే జరిపించుకొనబడినవై యున్నవి. (2) ధర్మశాస్త్ర ప్రకారమైన స్నానములు ఎక్కువగా సంస్కార శుద్ధికి సంబంధించినవైయున్నవి, అయితే యోహాను ఇచ్చిన బాప్తిస్మము సందర్భములో మారుమనస్సు పొందుట మరియు పాపక్షమాపణ గూర్చి బహుగా నొక్కివక్కాణింపబడినది. (3) ధర్మశాస్త్ర ప్రకారమైన సంస్కార స్నానములు పునరుక్తంగా చేయబడినవి, కానీ యోహాను బాప్తిస్మము ఒక్క సారే చేయబడిన కార్యమై యుండినది. (4) అన్యమతావలంబికులు బాప్తిస్మము అన్యజనులు యూదా మతమును స్వీకరించినప్పుడు నిర్వహింపబడినది అయితే యోహాను బాప్తిస్మము రానై యుండిన దేవుని రాజ్యమునకు సిద్ధపాటుగా యూదుల కొరకై యుండినది. యూదా మతములో దాని వేర్లు లోతుగా పాతుకుపోయి యుండినప్పటికిని, యోహాను బాప్తిస్మము దానికి ముందుండిన అభ్యాసములకు సుస్పష్టంగా భిన్నమైనదై యుండినది. "నీళ్లలో బాప్తిస్మమిచ్చుటకు నన్ను పంపెను" అని యోహాను తానే సాక్ష్యమిచ్చాడు (యోహాను 1:33). యోహాను బాప్తిస్మమునకు పరలోకము నుండి అధికారమియ్యబడినదని యేసు స్పష్టముగా తెలియజెప్పాడు (మత్తయి 21:23-27 చూడుము).

యోహాను యొద్దకు వచ్చినవారు మారుమనస్సు తరువాత వారికి బాప్తిస్మమియ్యబడినది, ఏలయనగా పాపక్షమాపణ పొందగోరుచుండినవారు మారుమనస్సు పొందవలసినదేనని యోహాను పిలుపునిచ్చాడు (ఎజ్రా 9:6-15; కీర్తనలు 51:1-4; దానియేలు 9:4-11 చూడుము). జే. డబ్ల్యు. మెక్‌గార్వే ఇలా సూచించుచున్నాడు, "పాపపు ఒప్పుకోలు చాలా వరకు ఒక సర్వసాధారణ లక్షణముగలదై యుండును; స్వల్ప కాలము చేయబడిన యోహాను పరిచర్యనుబట్టి, బాప్తిస్మమియ్యబడినవారు భారీ సంఖ్యలో ఉండినందునుబట్టి, ప్రతి వ్యక్తి వాని సమస్త పాపములను సవివరముగా ఒప్పుకొనియుండకపోవచ్చునను అనుమానమును వారించుచున్నది."[22]

యోహాను పశ్చాత్తాపపడిన యూదలకు **యొర్దాను నది**లో బాప్తిస్మమిచ్చాడు. యొర్దాను నదిని లూయిస్ ఇలా వర్ణించుచున్నాడు:

> గలిలయ సముద్రము నుండి దిగువగా మృత సముద్రము వరకున్న ఈ నది విమానంలో పయనించగలిగినంత దూరం. అరవై అయిదు మైళ్ల విస్తీర్ణము మాత్రమే చుట్టుముట్టుచున్నప్పటికిని, యొర్దాను నది రెండు వందల కంటె ఎక్కువ మైళ్లు పారుచున్నది. బాప్తిస్మము కొరకు అవసరమైయుండు నీటిని పుష్కలంగా కలిగియుండి, యెరికో పట్టణమునకు తూర్పున సుమారు తొంబై అడుగులు వెడల్పై, మూడు నుండి పన్నెండడుగుల లోతుగలదగును. దానిని అవతలి తీరమునకు దాటుటకు లోతులేని ప్రదేశములలో తప్ప మిగిలిన చోట్లలో పడవలను ఉపయోగించుకొనవలెను.[23]

### సిద్ధపరచు మారుమనస్సు (3:7-12)

**7అతడు పరిసయ్యులలోను, సద్దూకయ్యులలోను, అనేకులు బాప్తిస్మము పొందవచ్చుట చూచి-సర్పసంతానమా, రాబోవు ఉగ్రతను తప్పించుకొనుటకు మీకు బుద్ధి చెప్పినవాడెవడు? 8-9మారుమనస్సుకు తగిన ఫలము ఫలించుడి. -అబ్రాహాము మాకు తండ్రి అని మీలో మీరు చెప్పుకొన తలంచవద్దు; దేవుడు ఈ రాళ్లవలన అబ్రాహామునకు పిల్లలను పుట్టింపగలడని మీతో చెప్పుచున్నాను. 10ఇప్పుడే గొడ్డలి చెట్లవేరున ఉంచబడియున్నది గనుక మంచి**

**ఫలము ఫలింపని ప్రతి చెట్టును నరకబడి అగ్నిలో వేయబడును. [11]మారుమనస్సు నిమిత్తము నేను నీళ్లలో మీకు బాప్తిస్మ మిచ్చుచున్నాను; అయితే నా వెనుక వచ్చుచున్నవాడు నాకంటె శక్తిమంతుడు; ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను ఆయన పరిశుద్ధాత్మలోను అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును. [12]ఆయన చేట ఆయన చేతిలో ఉన్నది; ఆయన తన కళ్లమును బాగుగా శుభ్రముచేసి గోదుములను కొట్టులోపోసి, ఆరని అగ్నితో పొట్టును కాల్చివేయునని వారితో చెప్పెను.**

**వచనము 7.** యూదీయ నాయకులు వారిలో ఉండిన జిజ్ఞాస ఆయన బోధలు వినాలని యోహాను యొద్దకు వెళ్లారు. వారిలో **పరిసయ్యుల** ప్రతినిధులుండిరి. ఈ పక్షమునకు చెందినవారు మెక్కాబీయుల తిరుగుబాటుకు సంబంధించిన హెసిడియనుల నుండి ఉద్భవించినవారని సర్వసాధరణంగా భావింపబడుచున్నది.[24] ఆ కాలమందు సెల్యూకయుల చేత యూదులపై బలవంతముగా రుద్దబడుచుండిన గ్రీకు సంస్కృతిని అవలంబించుటకు వారు తిరస్కరించారు. ధర్మశాస్త్రము ఉల్లంఘింపబడకుండునట్లు, కొంత కాలము తరువాత పరిసయ్యులు ధర్మశాస్త్రమును కాపాడు కంచెగా నుండుటకు సాంప్రదాయములకు సంబంధించిన ఒక జటిలమైన సంవిధానమును అభివృద్ధిచేసికొన్నారు.[25] వేదాంతశాస్త్ర సంబంధముగా ధర్మశాస్త్రమును కాపాడుటకు కట్టుబడియున్నవారైనందున, వారు దేవదూతల యందును, ఆత్మల యందును, మృతుల పునరుత్థానమునందును విశ్వాసించారు (అపొస్తలుల కార్యములు 23:8). యూదులలో వారే అతి నిష్ఠగా నుండిన విభాగమని వారు తమ్మునుతాము ఎంచుకొన్నారు (అపొస్తలుల కార్యములు 22:3; 26:5; ఫిలిప్పీయులకు 3:5). "పరిసయ్యులు" అను పేరునకు "వేరుచేయబడినవారు" అని అర్థము, ఏలయనగా ధర్మశాస్త్రము విషయంలో వారు అజ్ఞానులని పరిగణించుండిన సామాన్య ప్రజల నుండి వారు తమ్మునుతాము వేరుపర్చుకొన్నారు (యోహాను 7:47-49). వారు యూదా ప్రజల్లో ప్రభావితము చేసిన ప్రధాన పరిధి సమాజ మందిరమై యుండెను (యోహాను 9:13, 22). చరిత్రకారుడైన జోసీఫస్ ప్రకారం, పరిసయ్యుల విభాగమునకు చెందినవారి సంఖ్య ఆరు వేలు.[26]

**సద్దూకయ్యులలో** నుండి కూడ కొందరు సభ్యులు యోహాను యొద్దకు వెళ్లారు. ఈ పక్షమునకు చెందినవారు యాజకులు మరియు సంపన్న వర్గమునకు సంబంధించినవారై యుండిరి. వారి పేర్లు సాదోకు, రాజైన సొలొమోను కాలములో ప్రధాన యాజకుడుగా నుండినవాని, మూలము నుండి ఉత్పన్నము కావచ్చును (1 రాజులు 2:35). పరిసయ్యుల వలెనే, వీరి పక్షమువారు మెక్కాబీయుల కాలములో తలెత్తి యుందురు. మితిమీరిన వీరి జీవిత విధానములోను రోమీయులతో కలిగియుండిన సహకారములోను వీరికి వీరే సాటి యథాపూర్వస్థితిని కొనసాగించుచు, వారి అధికారాన్ని మరియు ప్రత్యేకార్హతలను వారు నిలువబెటుకొన్నారు. సద్దూకయ్యులు దేవదూతల యందును, ఆత్మల యందును, పునరుత్థానమందును, లేదా బహుమానములు మరియు దండనలలోను విశ్వసించలేదు (22:23; అపొస్తలుల కార్యములు 23:8).[27] ఇంతేగాక, వారు పరిసయ్యుల మౌఖీక సాంప్రదాయములను తృణికరించారు.[28] అనేక మంది సద్దూకయ్యులు యాజకులై యుండిరి, గనుక వారు ప్రభావితము చేయగలిగిన పరిధి, యెరూషలేములోని దేవాలయము, పరిసయ్యులు

మరియు సద్దూకయ్యులు యూదుల మహా సభ సన్హెడ్రిన్‌లో ప్రాతినిధ్యం వహించారు.

యోహాను యొద్దకు వచ్చిన యూదీయ నాయకులు ఆయన ఎవరై యుండెనో, ఆయన చేయుచున్న కార్యములు చేయుటకు ఆయనకు అధికారము ఎవరిచ్చారో తెలిసికొనవలెనని ఆశించారు (యోహాను 1:19–28). యోహాను ఇచ్చుచుండిన **బాప్తిస్మము** దేవుని భవిష్యత్ రాజ్యములో గల సభ్యత్వమును సూచించినదనియు గనుక వారు ఆయన చేత బాప్తిస్మము పొందుటయే ఉత్తమమని వారిలో కొందరు అర్థంచేసికొన్నారు. అయితే యోహాను వారిని చూచి ఉగ్రుడయ్యాడు ఏలయనగా ఆయన వారి వేషధారణను పసిగట్టాడు. ఆయన వారిని సర్పసంతానమా అని సంబోధించుచు, **రాబోవు ఉగ్రతను తప్పించుకొనుటకు మీకు బుద్ధిచెప్పినవాడెవడు?** అని వారిని ప్రశ్నించాడు. సమీపించుచుండు మంటలను చూచి పాములు వాటి పుట్టల్లోంచి తప్పించుకొని పారిపోవు రీతినే (అపొస్తలుల కార్యములు 28:3 చూడుము), కేవలము భౌతిక బాప్తిస్మ కార్యమునకు లోబడుట ద్వారా రాబోవుచుండిన తీర్పును వారు తప్పించుకొనగలరని ఈ యూదీయ నాయకులు అనుకొనుచుండినట్లు అగుపించుచున్నది.

మత్తయి 3:7 యోహాను బోధలకును యేసు బోధలకును మధ్య గల మరొక సమాంతరమును చూపించుచున్నది. “సర్పసంతానము” అను పేరు ఆయనను వ్యతిరేకించుచు, వంచనతో కూడినదియు అవినీతిమయమైన పరిసయ్యుల జీవితమును చిత్రీకరించుటకు అటుతరువాత యేసు చేత ఉపయోగింపబడినది (12:34). యోహాను అడిగినట్లే యేసు కూడ వారినొక ప్రశ్న అడిగాడు: “సర్పములారా, సర్పసంతానమా, నరకశిక్షను మీ రేలాగు తప్పించుకొందురు?” (23:33).

**వచనములు 8, 9**. వారు ప్రస్తుతము చేయుచుండిన దానికంటె ఎక్కువే చేయవలసి యున్నదని యోహాను పరిసయ్యులకును, సద్దూకయ్యులకును తెలియజెప్పాడు. వారు **మారుమనస్సుకు తగిన ఫలము ఫలించవలసి యుండినది.** ఆయన వారికి బాప్తిస్మమియ్యక మునుపు వారు మారుమనస్సు నొందారని చెప్పుటకు వారు నిదర్శనమును ప్రదర్శించవలసి యుండినది. “ఫలము” అను మాట లేఖనములలో ఒకని ప్రవర్తనను ప్రదర్శించు పదముగా ప్రయోగింపబడుచున్నది (7:20; 12:33; 21:43). యథార్థమైన మారుమనస్సుకు జీవిత సంస్కరణ బొత్తిగా అవశ్యకమైనదై యున్నది (అపొస్తులుల కార్యములు 26:20). యోహాను కొందరికిచ్చిన ఆదేశములు, ఈ వాస్తవమును వర్ణించుచున్నవి (లూకా 3:10–14).

రక్షణ విషయంలో వారి జాతీయతపై గాని లేదా కుటుంబము యొక్క మూలముపై గాని వారు అధారపడకూడదని యోహాను యూదీయ నాయకులను విన్నవించుకొన్నాడు. కేవలము భౌతికంగా **అబ్రాహాము** సంతానమై యుండుటను దేవుని అనుగ్రహామునకు పాత్రులగునట్లు అది ఆయన దృష్టికి అంగీకారమగునని లెక్కించకూడని సమయము రానే వచ్చింది. వాస్తవమునకు, దీనిని వారెన్నటికినీ సాధించలేరు; వారి వంశపరంపరనుబట్టి వారు దేవుని దృష్టికి అంగీకారమైనవారని వారనుకొనుచుండినదంతా కేవలము వారి ఊహాగానమే అయియుండినది (యోహాను 8:31–59; రోమీయులకు 2:1–29; 4:1–25). మౌన్స్ ఇలా వివరించుచున్నాడు, “అబ్రాహాము, ఆయన తన వంశస్థులందరిని దృష్టిలో ఉంచుకొని వారి సమస్త [ఆధ్యాత్మిక] అవసరములకు [ఆశీర్వాదములకు] సరిపడు యోగ్యతా నిక్షేపమునొకదానిని నిర్మించినంతటి ఒక అన్యూహ్యమైన సద్భక్తుడై యుండెనని

యూదుల బోధకులు ఉపదేశించారు (cf. *Mekilta Exod.* 14:15తో పోల్చి చూడుము)."[29] ఒక ప్రాచీన యూదీయ మూలాధారము ప్రకారము, "ఇటుతరువాత (ఈ తనువు చాలించిన తరువాత) అబ్రాహాము నరకము యొక్క ద్వారము దగ్గర కూర్చొని యుండి, సున్నతి పొందిన ఏ ఇశ్రాయేలీయుని లోనికి అనుమతించాడు."[30]

**దేవుడు ఈ రాళ్ల వలన అబ్రాహామునకు పిల్లలను పుట్టింపగలడని మీతో చెప్పుచున్నాను.** డోనాల్డ్ ఏ. హేగ్నర్ ఇలా చెప్పుచున్నాడు, "యోహాను చేసిన ఘోషణ శబ్దచమత్కారముతో కూడినదై యున్నట్లు అగుపించుచున్నది, ఎందుకనగా అరమెయిక్ భాషలో (హెబ్రీ భాషలో కూడ) 'పిల్లలు' (*bĕnayyā'*) అను మాటకు ఉపయోగింపబడిన పదము (*'abnayyā*) 'రాళ్లు'కు ఉపయోగింపబడిన పదము వలెనే ఉన్నది."[31] యోహాను తన ఉపదేశములందు దృశ్యసాధనములుగా ఉపయోగించుట కొరకు అరణ్యములో ఇటువంటి రాళ్లు (4:3 చూడుము) అనేకముండినవి; అయనకు సమీపమున ఉండిన రాళ్లను యోహాను చూపించుచుండెనని "ఈ" అను సర్వనామము సూచించుచున్నది. యూదులు "బండ" నుండి "చెక్కబడిరి" అనగా, వారు తండ్రియైన అబ్రాహాము నుండి కలిగిరి (యెషయా 51:1, 2). ఏదిఏమైనా, అబ్రాహామునకు ఆధ్యాత్మిక మూలపురుషుని సమకూర్చుటకు దేవుడు వారిపై ఆధారపడలేదు. లియోన్ మోర్రిస్ ఇలా రాయుచున్నాడు, "భవిష్యత్తు కొరకైన ఎటువంటి ఆశనైనను వాగ్దానము చేయని వారిలో నుండి ప్రత్యేకార్హతగల ప్రజలను ఏ సమయంలోనైనా లేవదీయుట అది దేవుని అధికారాధీనములో ఉన్నదని యోహాను వారికి తెలియజెప్పుచున్నాడు."[32] ఇందులో దేవుడు అన్యజనులను కలుపుచున్నాడని యోహాను ఘోషణ పరోక్షంగా చూపించుచున్నది (8:11, 12; గలతీయులకు 3:26-29 చూడుము).

**వచనము 10.** యోహాను, ఫలమును గూర్చిన (3:8) తన అలంకారమును ఫలమిచ్చు చెట్లకే అన్వయించాడు. దేవుని నీతియను **గొడ్డలి చెట్ల వేరున ఉంచబడినది, ఫలించని ప్రతి చెట్టు నరకబడి అగ్నిలో వేయబడును**. పాత నిబంధన ఒక అడవి నరికివేయబడుచున్న ఊహాత్మకమును తప్పక సంభవింపనైయున్న ప్రజా నాశనము గూర్చి కళ్లకు కట్టినట్లున్న చిత్రీకరణముగా ప్రయోగించుచున్నది (యెషయా 10:33, 34; యిర్మీయా 46:22). యోహాను చేయుచున్న ప్రస్తావన ఇశ్రాయేలుపై దేవుడు రోమా సైన్యము చేత క్రీ.శ. 70లో తీర్చనైయుండిన తీర్పును సూచించుచున్నది. ఏదిఏమైనా, అగ్ని మరియు నాశనమును గూర్చి అటుతరువాత వచనాల్లో వాడబడిన ఇటువంటి భాష అంత్య దిన తీర్పునందు అవిధేయులకు కలుగు నాశనమును సూచించుచున్నట్లు అగుపించుచున్నది. మరొకసారి, యోహాను చేత పలుకబడిన మాటలు యేసు ఉపదేశములలో ప్రతిధ్వనించుచున్నవి (7:19; యోహాను 15:2, 6 చూడుము).

**వచనము 11.** ఆయన ప్రజలకు **నీళ్లలో బాప్తిస్మమిచ్చాడని** యోహాను చెప్పాడు. ఈ వచనములో "తో" అని NASBలో అనువదింపబడిన విభక్తి ప్రత్యయము (*en*) అనేక అర్థములు కలిగియున్నది. "బాప్తిస్మమిచ్చుట" (baptize) అను క్రియాపదము "[నిండుగా] ముంచు" అను అర్థమిచ్చుచున్నందు వలన (3:6పై గల వ్యాఖ్యానము చూడుము). విభక్తి ప్రత్యయము *en* ను "లో" అని అనువదించుట ఉత్తమము; యోహాను "నీళ్లలో" ముంచుచుండెను (JNT).

యోహాను, ప్రజలకు మారుమనస్సు నిమిత్తమైన (*eis metanoian*) నీళ్లలో బాప్తిస్మము

నిచ్చాడు. నిర్దిష్టమైన ఈ పదజాలము యొక్క అర్థము తర్కింపబడుచున్నది. లూయిస్ చేసిన ఈ క్రింది వ్యాఖ్యానము న్యాయసమ్మతముగా నున్నది,

> బాప్తిస్మము, దానిని పొందుకొను వానిలో మారుమనస్సు కలుగుజేయుటకు రూపొందిపబడినదని వాదోపవాదములు చేయబడరాదు, ఏలయనగా బాప్తిస్మము పొందుకొనుటకు మారుమనస్సు ఒక పూర్వాకాంక్షితమై యుండినది. దీనిక వ్యతిరేకముగా చూచినట్లయితే, ఇచ్చట *eis* అని "సర్వసాధారణముగా" ఉపయోగించుటను మనము చూచుచున్నాము (అనగా, ప్రజలు మారుమనస్సు పొందారు కాబట్టి వారికి బాప్తిస్మము యియ్యబడింది) అధికార స్వరంతో చెప్పువారు *eis* వాడబడిన ఇటువంటి సమాంతరమైన సందర్భములను చూపించలేకపోయారు. ఒక వేళ మనము మార్కు మరియు లూకా ఉపయోగించిన పదజాలము నుండి ["మారుమనస్సు విషయమైన బాప్తిస్మము" నుండి – మార్కు 1:4; లూకా 3:3] మత్తయి ఉపయోగించిన పదమును అనువదించినట్లయితే, యోహాను ఇచ్చిన బాప్తిస్మము మారుమనస్సుతో సంబంధము కలిగియుండినది, లేదా మారుమనస్సు దిశగా సూచింపబడుచుండిరి.[33]

ఈ పదజాలము యొక్క భావమును, "తో చూచినట్లయితే, 'సంబంధముతో,' లేక 'ఏకీభావములో' అని చెప్పుకొన్నట్లయితే అది చక్కగా అర్థమగునని" హేగ్నర్ చెప్పుచున్నాడు.[34] గుంద్రి ఇలా చెప్పుచున్నాడు, " 'మారుమనస్సు విషయమైన' బాప్తిస్మము, దానిని పొందుకొన్నవారు వారి మారుమనస్సును ప్రతీకాత్మక చర్యలో దానిని అమలుచేయుట ద్వారా ప్రత్యక్షీకరించుకొనగలుగునట్లు వారిని సమర్థవంతులనుగా చేసినదను ధ్వనింపు నిచ్చుచున్నది."[35]

యోహాను ఇచ్చిన బాప్తిస్మము "పాపములు క్షమింపబడుకొరకు" కూడ ఉద్దేశింపబడినది (మార్కు 1:4). క్షమాపణకు ఆధారమిచ్చు అసలైన అర్హత క్రీస్తు సిలువ మీద మరణించునంత వరకు కూడ సాధింపబడలేదు (రోమీయులకు 3:21–26; హెబ్రీయులకు 9:11–28), గనుక యోహాను ఇచ్చుచుండిన బాప్తిస్మముపై ఉద్దేశము విషయంలో న్యాయసమ్మతమైనదై యుండినది. యోహాను ఇచ్చుచుండిన బాప్తిస్మము పద్ధతి ప్రకారము బాప్తిస్మము పొందిన వారిలో ఎవరైనను క్రీస్తు మరణమునకు మునుపు మరలా బాప్తిస్మము పొందారను వివరణను మనము తెలిసికొనము (అపొస్తలుల కార్యములు 1:15; 2:41; NIV). క్రీస్తు మరణము తరువాత యోహాను ఇచ్చిన బాప్తిస్మము పద్ధతి చొప్పున మరలా బాప్తిస్మము పొందుకొన్నవారు ఎవరైనా ఉన్నారా అనంటే, లేఖనములలో ఒక్క సారి పేర్కొనబడినట్లు పౌలు ఎఫేస్సు పట్టణంలోని పన్నెండు మందికి బాప్తిస్మము ఇచ్చిన సంఘటన మాత్రమే కలదు (అపొస్తలుల కార్యములు 19:1–7). పెంతెకొస్తు దినాన మహా అదేశమునకు సంబంధించిన బాప్తిస్మము ప్రవేశపెట్టబడిన తరువాత, యోహాను ఇచ్చిన బాప్తిస్మము ఆ మీదట న్యాయసమ్మతము కానిదయ్యింది.

అతని వెనుక వచ్చుచుండినవాడు అతని కంటె శక్తిమంతుడై యుండును, గనుక అతడు క్రీస్తుకు ముందుగా పంపబడినవాని పాత్రను అతి వినయముతో అతడు అంగీకరించుచున్నాడని యోహాను సుస్పష్టం చేసాడు (యోహాను 1:19–36; 3:28–30). నా వెనుక వచ్చుచున్నవాడు అను పదజాలము దాని లక్షణములో అది కాలక్రమానుగతమైనదై యున్నది, కానీ అది మెస్సీయాను – "రాబోవువానిని" – గూర్చిన వర్ణనయై కూడ ఉన్నది

(11:2, 3; NRSV).[36] **ఆయన చెప్పుల వారును విప్పుటకైనను పాత్రుడను కాదని** యోహాను చెప్పాడు. మోర్రిస్ ఇలా వివరిస్తున్నాడు,

> ఆ కాలంలో పాలస్తీనాలోని ఉపదేశకులకు వేతనములు లేవు, కానీ శిష్యులు వారి ఉపదేశకులకు వారి శాయశక్తులా సహాయం చేయుట వారికది రివాజుగా ఉండినది. యూదుల బోధకులకు సంబంధించిన ఒక నానుడి కలదు, "చెప్పుల వారును వదులు చేయుట తప్ప, ఒక బానిస తన యజమానునికి చేయు ప్రతి సేవను, ఒక శిష్యుడు కూడా వాని ఉపదేశకునికి చేయవలెను." బానిస తప్ప మరెవ్వరును చేయని సేవనైనను చేయుటకు అతడు యోగ్యుడు కాదని చెప్పగలుగుట, అది యోహాను వినయమునకు ఒక సంకేతమై యున్నది.[37]

యోహాను వెనుక వచ్చుచున్నవాడు, **పరిశుద్ధాత్మలోను అగ్నితోను బాప్తిస్మమిచ్చునని** అతడు చెప్పాడు. ఈ ప్రవచనము సహాయంతో, క్రీస్తు నీటితో బాప్తిస్మమియ్యడను ఒక తుది అభిప్రాయమును మనము ఏర్పరచుకొనకూడదు. యోహాను భావము ఇదైయుండజాలదు, ఏలయనగా యోహాను తన మాటలను రూఢిగా పలికిన తరువాత ఎంతో కాలం గడుపక మునుపే, ప్రజలు నీటిలో బాప్తిస్మము పొందవలెనని యేసు ఆజ్ఞాపించాడు (యోహాను 3:26; 4:1, 2). యేసు నీటిలో బాప్తిస్మమిచ్చుటతో పాటు, పరిశుద్ధాత్మలోను అగ్నిలోను కూడ బాప్తిస్మమిచ్చునని, యోహాను భావించియున్నాడని స్పష్టమగుచున్నది.

యేసు పరలోకమునకు తిరిగి వెళ్లక మునుపు, ఆయన వెళ్లిన వెంటనే వారి మీదికి పరిశుద్ధాత్మను పంపునని ఆయన అపొస్తలులకు వాగ్దానమిచ్చాడు (యోహాను 14:16, 17, 26; 15:26, 27; 16:7–15). ఆయన తండ్రి యొద్దకు వెళ్లుటకు కొద్దిసేపటి క్రితమే, వారు "కొద్ది దినములలోగా పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరని" ఆయన వారితో చెప్పాడు (అపొస్తలుల కార్యములు 1:5). అది జరిగినప్పుడు, వారు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంటను భూదిగంతముల వరకును" ఆయనకు సాక్షులై యుండునట్లు "శక్తి నొందెదరని" ఆయన చెప్పాడు (అపొస్తలుల కార్యములు 1:8). ఈ వాగ్దానము యేసు ఆరోహణమైన పిదప పెంతెకొస్తు దినాన నెరవేరినది. ఆ దినాన, అపొస్తులులు మాత్రమే పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుకొనిరి (అపొస్తలుల కార్యములు 2:4, 7, 14, 15). పరిశుద్ధాత్మ స్వతస్సిద్ధముగా పరలోకము నుండి దిగివచ్చిన సంఘటన మరొకటి మాత్రమే, అపొస్తులుల హస్తములు ఉంచబడకుండా (అపొస్తలుల కార్యములు 8:14–19; 19:1–7), కొర్నేలీ ఇంటిలో జరిగినది (అపొస్తలుల కార్యములు 10:24, 44, 45; 11:15–17). ఈ రెండు సందర్భములలోను, "సర్వజనుల" మీదికి, యూదులు మరియు అన్యజనుల మీదికి, పరిశుద్ధాత్మను క్రీస్తు పంపించాడు, తత్ఫలితంగా అనేక ఆత్మలు రక్షింపబడినవి (అపొస్తలుల కార్యములు 2:41; 10:47, 48). పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుకొనుట యోవేలు ప్రవచనము ప్రకారమైనదై యుండినది:

> "తరువాత నేను సర్వజనుల మీద నా ఆత్మను కుమ్మరింతును;
> మీ కుమారులును మీ కుమార్తెలును
> ప్రవచనములు చెప్పుదురు,
> మీ ముసలివారు కలలు కందురు,
> మీ యౌవనస్థులు దర్శనములు చూతురు"

(యోవేలు 2:28; అపొస్తలుల కార్యములు 2:17 చూడుము).

యెహాను చెప్పుచుండిన 'అగ్నిజ్వాలల వంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద రాలినట్లు" అపొస్తులులకు అగుపించినప్పుడు అగ్ని బాప్తిస్మము సంభవించినదని కొందరు ఉపదేశించుదురు (అపొస్తలుల కార్యములు 2:3). ఏదిఏమైనా, ఆ నాలుకలకు అట్టి ఆకారముండినప్పటకిని, అవి అక్షరాలా అగ్నితో కూడిన నాలుకలు కావు. ఇంకా, అపొస్తులులు అగ్నిలో ముంచబడలేదు ("బాప్తిస్మము" యొక్క అర్థము ప్రకారము). యోహాను ఈ మాటల గూర్చి తన సొంత అర్థవివరణను తరువాత వచనంలో ఇచ్చాడు.

**వచనము 12.** మెస్సీయ, పంట కోత సమయంలో ఉన్న వ్యవసాయదారుని వలె చిత్రీకరింపబడిననాడు. పొలములోని పంట కొయబడిన తరువాత, కోయబడిన పనలు **కళ్లము** యొద్దకు తీసికొనిరాబడినవి, పరువబడిన ఈ పంట పనలపై తిరుగునట్లు నూర్చుడు సాధనమును ఎద్దులు లాగుచుండును, అప్పుడు పనల గడ్డి నుండి గింజలు వేరగును. గనుక వ్యవసాయదారుడు దానిని తూర్పారబట్టుటకు **చేటను** ఉపయోగించుచు ధాన్యమును గాలిలో ఎగరవేయును. అప్పుడు గాలి బరువుగా నుండు గింజలను తేలికగా నుండు పొట్టు నుండి వేరుచేయును; గింజలన్నీ ఒక కుప్పగా పోగవును, కానీ పొట్టు గాలి చేత ఎగిరిపోవును. వ్యవసాయదారుడు **గోదుములను కొట్టులో పోయును.** అయితే పొట్టును పోగుచేసి కుప్పగా పోసి దానిని కాల్చివేయును లేదా వంటచెరుకుగా ఉపయోగించును. క్రీస్తు కూడ ఇలాగే చేయును: **ఆయన పొట్టును ఆరని అగ్నితో కాల్చివేయును.** మలాకీ 4:1లో నున్న మెస్సీయ సంబంధిత ప్రవచనము, "వేరు గాని, కొమ్మ గాని మిగులని" (3:10 చూడుము) "గర్విష్ఠులందరిని దుర్మార్గులందరిని" పొట్టుగా గుర్తించుచున్నది. పాత నిబంధనలో కళ్లము కూడ తీర్పునకు సాంకేతిక చిహ్నముగా వాడబడుచున్నదను విషయం గమనార్హమైనదై యున్నది (కీర్తనలు 1:4; యెషయా 17:13; 29:5, 6; 33:11; 41:15, 16; యిర్మీయా 15:7; హోషేయ 13:3; జెఫన్యా 2:2).

యోహాను చెప్పుచుండిన అగ్నిలో బాప్తిస్మము; తీర్పు గూర్చి మాత్రమే సూచించగలదు, అప్పుడు అనీతిమంతులు అగ్ని గుండములో పడవేయబడుదురు (ప్రకటన 20:11-15; 21:8). మత్తయి రాసిన సువార్తలో తీర్పుకు గుర్తుగా అగ్ని నిలకడగా వాడబడుచున్నది (5:22; 7:19; 13:40, 42; 18:8, 9; 25:31-33, 41, 46). మనము అగ్నిలో బాప్తిస్మము కొరకు ప్రార్థించకూడదు, ఏలయనగా ఇది మనము పొందగోరుకొనని ఒక బాప్తిస్మమై యున్నది.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

## బాప్తిస్మమిచ్చు యోహాను జీవిత సంగ్రహము (3:1-17)

బోధకులు ఒక పని నిమిత్తము నియమింపడుటకు ఎన్నుకొనబడునప్పుడు, వారు తరుచుగా వారి జీవిత సంగ్రహమును నివేదించుకొనవలెనని కొరబడుదురు. చాలావరకు, నియామకమునకు వారు ఎంపిక చేయుబడినట్లయితే, అభ్యర్థులు చేయవలసిన పనులు విషయంలో వారి నుండి ఏమి ఆశింపబడునో, సహోదరులకు కొంత వరకైనా తెలిసియుండును. బాప్తిస్మమిచ్చు యోహాను జీవిత సంగ్రహములో తన గూర్చి తాను ఏమి నివేదించుకొనేవాడో

ఈ అధ్యాయము ఈ క్రింది వాస్తవములను సూచించుచున్నది.

*పేరు:*

యోహాను. ప్రస్తుతము నన్ను అందరు బాప్తిస్మమిచ్చు యోహాను అందురు (3:1) ఏలయనగా నేను పాపక్షమాపణ కొరకైన బాప్తిస్మమునకు సంబంధించిన విషయాలు బోధించుచు అనేకులకు బాప్తిస్మమిచ్చాను.

*తలిదండ్రులు:*

తండ్రి – జెకర్యా, ఒక యాజకుడు, అబీయా తరగతికి చెందినవాడు; ఎలీసబెతు, అహరోను కుమార్తెలలో ఒకతె (లూకా 1:5).

*నేను అత్యంత దీర్ఘకాలము నివసించిన స్థలము:*

యూదయ అరణ్యము, అచ్చట నాకు మిడతలు మరియు అడవి తేనె ఆహారముగా ఉండినవి (3:1, 4).

*ప్రధాన ప్రబోధ బాధ్యత:*

ప్రభువు మార్గములను సిద్ధపరచుటకు ఆయనకు ముందుగా వెళ్లుట, వారి పాపములు క్షమింపబడుట ద్వారా లభించు రక్షణను ఆయన ప్రజలకు ఎరుకచేయుట (లూకా 1:76–77).

*ఇటువలి ప్రబోధ విధులు:*

పరలోక రాజ్యము సమీపించి యున్నది గనుక వారందరును మారుమనస్సు నొందవలెనని నేను ప్రజలందరికి తెలియజెప్పుచున్న ఒకని స్వరమునై యుంటిని (మత్తయి 3:3).

*నా ప్రబోధములలో ...*

- నేను పాపమును అల్పమైనదానిగా పరిగణించను (మత్తయి 3:1, 2).
- సందేశము నందించుటకు నా వ్యక్తిగత సుఖమునుగాని అనుకూలతగాని అడ్డువచ్చుటను నేను అనుమతించను (3:1, 3, 4).
- జనసమ్మతముకాని కొన్ని అంశములపై నేను సందేశముల నందించుదును, వాటిని అర్థంచేసికొని అంగీకరించుటకు సంపూర్ణంగా సంసిద్ధంగాలేని శ్రోతలను సంబోధించుదును (3:5–9).
- నేను యేసును హెచ్చించుదును (3:11, 12).
- ఒకడు నశించుట సాధ్యమని నేను హెచ్చరించుదును (3:10–12).
- ఒకడు రక్షణ నొందుట సాధ్యమని కూడ నేను ఉపదేశించుదును (3:12).[38]

*లక్ష్యములు:*

నేను దాదాపుగా నా లక్ష్యములన్నిటిని నెరవేర్చాను గనుక కొన్ని అసమానమైన అనుభూతులను అనుభవించాను (3:13–17).

*తాజా సమాచారము:*

ప్రస్తుత కాలములో, ఆయన చేసిన తప్పునుబట్టి నేను రాజైన హేరోదును మందలించినందుకు చెరసాలలో వేయబడియున్నాను (లూకా 3:19, 20). నేను రాజైన హేరోదు అధికారము క్రింద ఉన్నప్పటికిని, నా ప్రభువు శక్తినిబట్టి నేను స్వతంత్రుడనై యున్నాను.

## యోహాను మరియు యేసు నుండి మనము నేర్చుకొనగల పాఠములు (3:1-17)

బాప్తిస్మమిచ్చు యోహాను (ఆయన ప్రజలకు బాప్తిస్మమిచ్చాడు గనుక ఈ పేరుతో పిలువబడ్డాడు) ప్రజలందరు మారుమనస్సు పొందవలెనని వారికి పిలుపు నిచ్చుచు యూదా అరణ్యములో ప్రబోధించుటకు మొదలు పెట్టుట ద్వారా దేవుడు నాలుగు వందల సంవత్సరముల కాలము మౌనముగా నుండిన పరిస్థితిని ఛేదించాడు. అతడు చిత్రవిచిత్రమైన దుస్తులు ధరించియుండి కఠోరమైన సందేశమును వినిపించుచుండినప్పటికిని తన యొద్దకు జనసమూహములను బహుగా ఆకర్షించుకొన్నాడు. ఆ కాలములో, యేసు పదునెనిమిది సంవత్సరముల తన సొంత మౌనమును ఛేదించాడు. మనకు తెలిసినంత వరకు, అంతకు మునుపు ఆయన తన పన్నెండవ యేట ప్రబోధించినట్లు తెలియుచున్నది; ఇప్పుడు ఆయన వయస్సు దాదాపు ముప్పది సంవత్సరములు (లూకా 2:42; 3:23). ఈ కథ మనకు కొన్ని (సుగుణ) పాఠములను నేర్పుచున్నది:

1. దేవుని సేవ చేయుటకు ముందుగా సిద్ధపడుట అత్యావశ్యమై యున్నది (3:1-3).
2. సందేశము యొక్క ప్రాముఖ్యత సందేశకుని బాహ్య ఆకారమునుబట్టి అంచనా వేయబడకూడదు (3:4-6).
3. యథార్థమైన మారుమనస్సు మరియు పాపము ఒప్పుకోలు లేకుండా ఇవ్వబడు బాప్తిస్మము దాని ఉద్దేశము నెరవేర్చదు (3:5-9).
4. దేవునికి లోబడవలసిన విషయంలో ఏ ఒక్కరికి మినహాయింపు లేదు (3:13-15).
5. దేవుని బిడ్డగా అంగీకరింపబడుట పరలోకమును వెదుకుచున్నవారందరికిని అంతిమ అవశ్యకతయై యున్నది (3:16, 17).[39]

## క్రీస్తు సేవ కొరకైన యోహాను సిద్ధపాటు (3:1-12)

రాబోవుచుండిన క్రీస్తు నిమిత్తమైన యోహాను సిద్ధపాటు గూర్చిన పాఠమును ఈ క్రింది అంశముల ఆధారంగా అభివృద్ధిచేసికొనవచ్చును:

1. సిద్ధపాటు సందేశము (3:1-4);
2. సిద్ధపాటు బాప్తిస్మము (3:5, 6);
3. సిద్ధపాటు మారుమనస్సు (3:7-12).

## సందేశకుని వినయము (3:11-14)

యోహాను క్రీస్తు సన్నిధానమందు నిలువబడినప్పుడు క్షమాపణ కొరకైన తన సొంత ఆధ్యాత్మిక అవసరతను ఎంతో వినయముతో గుర్తించాడు. అతడు తానే బాప్తిస్మము పొందవలసి యున్నదనియు, యేసుకు బాప్తిస్మమిచ్చుటకు చాలినవాడు కాడనియు స్వేచ్ఛగా యేసు యెదుట ప్రకటించాడు. అతని వెనుక వచ్చుచుండినవాని గూర్చి యోహాను, ప్రజలకు సముచితమైన సమాచారమును అందజేశాడు. యేసే మెస్సీయయని అతడు కనుగొన్నప్పుడు, ఇతరులు యేసు నొద్దకు వెళ్లవలెనని సూచించాడు (యోహాను 1:29). యోహాను వినయమును

గూర్చిన మాదిరిని నేటి బోధకులు అనుకరించవలసి యున్నది.[40]

*బోధకులు వారి సొంత పాపమును గుర్తించుచు, దేవుని యెదుట వినయమనస్కులై యుండవలెను.* బోధకులు "గాయములగల వారిని స్వస్థపరచువారు" అని చెప్పబడుచున్నది. వారు తామే దేవుని నుండి పొందుకొనిన కృపను ఇతరులకు అందజేయుచున్నారు. యూదులకు సువర్తమానమును పంచుకొనుచు పౌలు రోమా సామ్రాజ్యమందంటను పయనించుచుండగా, పాపులలో ఆయన "ప్రధానుడని" ఆయన ఎన్నుడును మర్చిపోలేదు (1 తిమోతి 1:15; KJV).

*బోధకులు వారందించు సందేశమును మొదట వారికే అన్వయించుకొనవలెను.* యేసు పరిసయ్యులను తీవ్రముగా దండించాడు ఏలయనగా "వారు చెప్పుదురే గాని చేయరు" (23:3; NIV). అతడే వేషధారియని ప్రజల చేత తెలిసికొనబడినట్లు, బోధకుడు బహుగా కార్యసార్థకమైనవాడై యుండలేడు (7:1–5 చూడుము). ఇతరులకు ప్రకటించిన తరువాత "తానే భ్రష్టుడైపోకుండునట్లు," స్వయం శిక్షణను అభ్యసించు విషయంలో పౌలు అంతరాత్మ ప్రబోధములచే పనులు చేయుచుండినవాడై యుండెను (1 కొరింథీయులకు 9:27). తన సందేశములను ఒక మాదిరితో పూర్తి చేయుటకు అతడు జాగ్రత్తపరుడై యుండెను. అందువలననే ఆయన "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము, మీరు నన్ను పోలి నడుచుకొనుడని" రచించాడు (1 కొరింథీయులకు 11:1).

*బోధకులు ప్రజలను తమ యొద్దకు గాక, ప్రభువు నొద్దకే నడిపించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.* ఈ వృత్తే అలాంటి స్వభావముగలదై యున్నది, గనుక బోధకుడు అందరి సావధానమునకు కేంద్రమగు అవకాశములు ఎక్కువ. ఏదిఏమైనా, ప్రధాన ఆకర్షణ యేసుప్రభువై యుండవలెను; బోధకుడు సందేశము అందింపబడుటకు కేవలము ఒక సాధనము మాత్రమే అయియున్నాడు. "మేము మమ్మును గూర్చి ప్రకటించుకొనుట లేదు గాని, క్రీస్తు యేసును గూర్చి ఆయన ప్రభువనియు, మమ్మును గూర్చి, యేసు నిమిత్తము మేము మీ పరిచారకులమనియు ప్రకటించుచున్నామని" పౌలు చెప్పుచున్నాడు (2 కొరింథీయులకు 4:5).

*ముగింపు.* బోధకులు బాప్తిస్మమిచ్చు యోహాను వైఖరిని అనుకరించుచు నడుచుకొన్నప్పుడు, వారు ఇతరులను క్రీస్తు నొద్దకు నడిపించుదురు గనుక వారు చేయుచుండు దేవుని రాజ్య పరిచర్యలో ఎక్కువ కార్యసాధకులై యుందురు.

డేవిడ్ స్ట్యూవర్ట్

---

సూచనలు

[1]పాత మరియు క్రొత్త నిబంధనల కాలమునకు నడుమ ఉండిన శూన్యతను యూదులు గుర్తించారు గనుక విశ్వసనీయుడైన ప్రవక్త ఒకడు వచ్చునని ఎదురు చూశారు (1 మెక్కాబీస్ 4:46; 9:27; 14:41; Josephus *Against Apion* 1.8). [2]"యోహాను మాటలు వినుట వలన గొప్పగా మనస్సు కరిగి పొయిన జనసమూహములు" మరియు "ప్రజలపై యోహాను చూపిన గొప్ప ప్రభావము" గూర్చి రచించాడు (Josephus *Antiquities* 18.5.2). [3]Robert H. Mounce, *Matthew*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 21. [4]Jack P. Lewis, *The Gospel According to Matthew*, Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 54. [5]Gerhard Kittel, "*erēmos*," in *Theological Dictionary of the New Testament*, ed. Gerhard Kittel, trans. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerd-

mans Publishing Co., 1964), 2:658-59. [6]John A. Broadus, *Commentary on Matthew* (Louisville: N.p., 1886; reprint, Grand Rapids, Mich.: Kregel Publications, 1990), 34. [7]Robert H. Gundry, *Matthew: A Commentary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 43. [8]"దేవుని రాజ్యమును" అను పదజాలమును మత్తయి నాలుగు సార్లు మాత్రమే ప్రయోగించాడు (12:28; 19:24; 21:31, 43). [9]Lewis, 55; Mounce, 23. [10]Paul. T. Butler, *Isaiah*, vol. 3, Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1978), 10.

[11]Lewis, 56; *Manual of Discipline* 8.13-16; 9.19 వారు చూడుము. [12]Josephus *Wars* 1.24.3 చూడుము. [13]Gundry, 45. [14]Leon Morris, *The Gospel According to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 55. [15]H. Leo Boles, *A Commentary on the Gospel According to Matthew* (Nashville: Gospel Advocate Co., 1936), 71. [16]Josephus *Antiquities* 18.5.2. [17]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick W. Danker (Chicago: University of Chicago Press, 2000), 164. [18]David S. Dockery, "Baptism," in *Dictionary of Jesus and the Gospels*, ed. Joel B. Green and Scot McKnight (Downers Grove, Ill.: InterVarsity Press, 1992), 55. [19]Mishnah *Mikwaoth.* [20]Dockery, 56-57; *Manual of Discipline* 3.4-9; 6.14-23 చూడుము. కుమ్రాన్ సమాజము ఎస్సెనీయుల పక్షమునకు చెందియుండుటకు అవకాశములు కలవు. వారి దైనందిన శుద్ధీకరణాచార కర్మకాండలలో ఒక భాగంగా ఎస్సెనీయులు "చన్నీటీలో స్నానం చేశారని" జోసీఫన్ సూచించాడు (Josephus *Wars* 2.8.5, 9).

[21]G. R. Beasley-Murray, *Baptism in the New Testament* (N.p., W. T. Whitley Lectureship, 1962; reprint, Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1994), 18-31; Epictetus *Dissertations* 2.9.9-21; Mishnah *Pesahim* 8.8; Talmud *Yebamoth* 46a; *Pesahim* 91b-92. [22]J. W. McGarvey, *The New Testament Commentary*, vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d), 34. [23]Lewis, 58. [24]1 Maccabees 2.42; 7:13; 2 Maccabees 14:6. [25]Mishnah *Aboth* 3.14. [26]Josephus *Antiquities* 17.2.4. [27]Josephus *Wars* 2.8.14. [28]Josephus *Antiquities* 18.1.4. [29]Mounce, 23. [30]*Genesis Rabbah* 48.8; Justin Martyr *Dialogue with Trypho* 140 చూడుము.

[31]Donald A. Hagner, *Matthew 1-13*, Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 50. [32]Morris, 59. [33]Lewis, 62. [34]Hagner, 51. [35]Gundry, 48. [36]కీర్తనలు 118:26; మలాకీ 3:1; మత్తయి 11:3; 21:9; 23:39; యోహాను 4:25. [37]Morris, 61, quoting Talmud *Ketuboth* 96a; *Baba Bathra* 53b చూడుము. [38]మత్తయి 3:1–17 ఆధారంగా ఒక జీవిత సంగ్రహమును అభివృద్ధిచేయుట కొరకైన ఈ అంశములు మరియు అభిప్రాయములు Jack Wilhelm రచించిన, "John the Baptist's Resumé as a Preacher," *RSVP Newsletter* 153-8-83-36 (1983) నుండి తీసికొనబడినవి. Jack Wilhelm, P.O. Box 2222, Florence, AL 35630 వారి అనుమతితో ప్రచురించబడినది. [39]Jack Wilhelm, "The Baptism of Jesus," *RSVP Newsletter* 172-6-84-41 (1984). [40]ఈ పాఠము ప్రత్యేకంగా బోధకులకు అన్వయింపబడుచున్నప్పటికిని, అది మొత్తం మీద క్రైస్తవులందరును వారి జీవితములకు అన్వయింపజేసికొనవచ్చును.